# అన్నపూర్ణ




తెలుగు కళాసమితి (న్యూజెర్సి) కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపిక చేసిన కథ

హఠాత్తుగా అన్నపూర్ణమ్మ తల్లి అన్నం పెట్టడం ఎందుకు మానేసిందో చెట్టుకింది అప్పిగాడికి అస్సలు అర్థం కాలేదు.

రోజూ పొద్దున్నే సూరీడుతో పాటు లేచి సూర్యునికి దణ్ణం పెట్టాక ఆ బంగళాకేసి చూస్తూ ఆ అమ్మకే దండం పెడ్తాడు. కడుపులో పేగులు అవురావురు మంటూండగా ఆ ఇంటికేసి చూస్తూ కూర్చుంటాడు. ఏడున్నర నుండి ఎనిమిదిన్నర లోపే ఆ తల్లి ఆమె పేరేమిటోగాని అప్పిగాడు పెట్టుకున్న పేరు అన్నపూర్ణ. ఆమె ఆ గుమ్మం ముందు ప్రత్యక్షమవుతుంది. ఆమె పిలుపు కోసమే అన్నట్లు అప్పిగాడి ఇద్దరు కూతుర్లు ఓ కొడుకు సత్తు గిన్నెలు కడుక్కుని ఎదురుచూస్తుంటారు.ఏ... అబ్బి ... అవో ఓ అమ్మి అవో ఆమె పిలిచీపిలవంగానే వాళ్ళు ఆ సత్తు గిన్నెలు పట్టుకుని పరుగుపెడ్తారు. రాత్రి మిగిలిన సాంబారు అన్నం కాస్త కాస్త కూరలు ఆమె ఆ గిన్నెల్లో వేస్తుంది. అప్పిగాడి పెళ్ళాం ఆ అన్నం ఆ కూరలు కలిపి పిల్లలందరికీ తలో ముద్ద పెడ్తుంది.వాళ్ళు ఆబగా ఆత్రంగా ఆ అన్నం తిని కడుపు నిండా చల్లటి నీళ్ళు తాగి దేశమేలే మహారాజు రాజధాని పర్యటన కెళుతున్నట్టు తలో సత్తుగిన్నె పట్టుకుని ఊరు మీదకు కులాసాగా అడుక్కోవడానికి వెడతారు.

అప్పిగాడుండే చెట్టు కెదురుగా వున్న ఆ ఇంట్లో నల్గురు అన్నదమ్ములు కలిపి ఉమ్మడిగా కాపురం వుండేవారు. ఆ ఇంటి వారు పనివాళ్ళని పెట్టుకో కుండా నలుగురు కోడళ్ళు కలిసి చక్కగా పనులు చేసుకుంటారు. ఏ చిన్న పేరంటమో పండగో ఆ ఇంట జరిగిందంటే ఇక అప్పిగాడి గుండె ఆనందసాగరమే అవుతుంది. వాళ్ళింట్లో పండగ జరిగిన మర్నాడు అప్పిగాడి చెట్టు క్రింది సంసారంలో పండుగే. నిన్నటి పండుగ తాలుకు అన్నం కూరలు కడుపు నిండా తిని రాత్రి కోసం జాగ్రత్తగా కుండలో పెట్టుకుని కుక్కలొచ్చి ముట్టకుండా ఉట్టిలో పెడ్తారు కూడా.

అప్పిగాడికి అన్నం పెట్టే అన్నపూర్ణమ్మంటే ఆ ఇంటి పెద్ద కోడలు. ఇది వరకు ఆ అమ్మ పెద్ద గిన్నెడు గంజి కూడా పోసేది. ఆ అన్నం తిని ఆ గంజి తాగేసరికి ఆ పొద్దు గడిచిపోయేది. ఇక వాళ్ళు అడుక్కోవలసింది రాత్రి కోసమే. కడుపు నిండా అన్నం పెట్టే ఆ అన్నపూర్ణమ్మను సంతోషంగా దీవించేవాడు అప్పిగాడు.

హఠాత్తుగా ఓ రోజున అన్నపూర్ణ గంజి పోయడం మానేసింది. "ఏమ్మా గంజిలేదా" అని అప్పిగాడు అడిగినప్పుడు

"ఇక నుండి గంజి వుండదు అప్పన్నా, చిన్న అయ్యగారు రిక్షాలో తెచ్చిన అట్ట పెట్టె చూసావుగా అందులో కుక్కర్ అని ఓ పెద్ద గిన్నె తెచ్చారు. అందులో వండితే గంజి వార్చనక్కరలేదు" వివరించింది.

ఆమె చెప్పిందేమీ అర్థం కాకున్నా ఇక నుండి వాళ్ళు తమకు గంజిపొయ్యరని మాత్రం అర్థమయి చాలా బాధపడ్డాడు. పోనీలే గంజిలేకున్నా ఆ అమ్మ అన్నం, సాంబారు ఇస్తుంది కదా అని సరి పెట్టుకున్నాడు.

కానీ ఇప్పటికి రెండు రోజులుగా ఆ అమ్మ అన్నం కోసం పిలవడం లేదు. రోజూ పిల్లలు వెళ్ళి ఏమ్మా అన్నం లేదా అని అడిగితే లేదు అంటున్నారట. ఊర్లోకి వెళ్ళి ఆ వీథి ఈ వీథి తిరిగి అడుక్కొచ్చుకుని ఇంత ముద్ద తినేటప్పటికి మూడో నాలుగో అవుతుంది. అప్పటికి అడుక్కున్న అన్నం పాడైపోతున్నది కూడా. అయినా ఆకలి తీర్చుకోను అదే తింటున్నారు. ఎవరి కడుపూ నిండడం లేదు.

వాళ్ళోవాడు అప్పిగాడే వెళ్ళాడు.

"అమ్మా" అని పిలిచాడు.

అన్నపూర్ణ ఇవతలికి వచ్చింది.

"ఏమ్మా అన్నం వెయ్యడం లేదేంటమ్మా" దీనంగా అడిగాడు.

"అత్తయ్యా ఆ సద్దన్నం, సద్ది కూరలు తెచ్చి అప్పన్నకు వెయ్యనా..?" అని లోనికి చూస్తూ అడిగింది అన్నపూర్ణమ్మ.

"చాల్లే సంబడం ... ఇన్నాళ్ళు ఫ్రిజ్ లేక అందరికీ దానాలు చేశావు. చేసింది చాల్లే ఫ్రిజ్ వచ్చాక కూడా అన్నీ దండగ దానాలు చేసేద్దామనే ..?" దీర్ఘం తీసింది అత్తగారు.

అన్నపూర్ణ అప్పన్నకేసి నిస్సహాయంగా చూసింది. ఆ చూపు అప్పన్నకు "ఫ్రిజ్" అంటే ఏమిటో వివరించకున్నా ఇక నుంచి సద్దన్నం సాంబారు వెయ్యలేము అన్న భావం వివరించింది.

అప్పన్న... అప్పన్న పిల్లలు ఆ ఇంటి మీద ఆశ వదులుకుని చిప్ప పట్టుకుని ఊర్లోకి నడిచారు.

\- ఉమా శివ

---

ప్రతి ఫ్రేములో స్వప్న

సినిమాస్కోప్ ఫోటో సీరియల్

కథ, ఫోటోప్లే, డైరెక్షన్:
బి.ఎం.ఈశ్వర్
రచనా సహకారం:
బి.సుజాత
ఫోటోలు:
చైతన్య మున్షి



